సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 12 । జూన్ । 2023



ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

గోలేటి టౌన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ముగిశాయి. వివిధ జిల్లాలకు చెందిన సుమారు 124 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 10లో▸



పరిమళించిన మానవత్వం

రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన బాలిక అంత్యక్రియలను మానవ సేవే మాధవ సేవ, యువజన సంఘాల నాయకులు నిర్వహించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/31.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పలుచోట్ల పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత కొనసాగనుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర ఉత్సవాల్లో జిల్లా కవి 'ఉదారి'



కవితను వినిపిస్తున్న నారాయణ

ఎదులాపురం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం సాహిత్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనానికి జిల్లా నుంచి ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ ప్రాతినిధ్యం వహించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎదుర్కొంటున్న నీటి గోసపై కవితను వినిపించారు. జిల్లాలో నాడు, నేడు వచ్చిన మార్పును వివరించారు. కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రముఖ కవి రామోజు హరగోపాల్ తదితరులు హాజరయ్యారు.

'ఉద్యమ ద్రోహులకే ప్రాధాన్యం'

ఆదిలాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమద్రోహులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అసలైన ఉద్యమకారులను విస్మరిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ నాయకుల దోపిడీని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు విజయ్ కుమార్, రమణ, విజయ్, కాంత, నరేశ్ పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు

బోథ్: జొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని కోరమండల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము విక్రయించిన పంట దిగుబడిని లారీలు లేవన్న సాకుతో మార్కెట్ యార్డులోనే ఉంచుతున్నారన్నారు. లారీల్లో తీసుకెళ్లే వరకు రైతులదే బాధ్యతని అధికారులు పేర్కొనడం సరికాదన్నారు. ఒకవేళ వర్షం పడితే జొన్నలు తడిసిపోయే అవకాశం ఉందని, కాంటా చేసిన వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడారు. దీంతో రైతులు శాంతించారు.



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

బడికి వేళాయె

- సమస్యలతో స్వాగతం పలకనున్న సర్కారు బడులు
- పాఠశాలకు ఇంకా చేరని పాఠ్యపుస్తకాలు, యూనిఫాం
- పూర్తికాని 'మన ఊరు- మనబడి' పనులు
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

జిల్లాలో మొత్తం పాఠశాలలు	1439
విద్యార్థుల సంఖ్య	1,39,421

పాఠశాలలకు చేరని పాఠ్య పుస్తకాలు, యూనిఫాం..

ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేస్తామని ప్రకటించినా ఆచరణలో మాత్రం అమలయ్యేది అనుమానమే. జిల్లాకు 6లక్షల 20వేలకు పైగా పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా, ఇప్పటివరకు 5లక్షల 40వేల వరకు చేరుకున్నట్లు విద్యా శాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం 20 శాతం వరకు మాత్రమే పాఠశాలలకు చేరుకున్నాయి. అలాగే యూనిఫాంది అదే పరిస్థితి. జిల్లాలో 1194 పాఠశాలలకు గాను 73,822 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం ఇవ్వాల్సి ఉంది. ఏప్రిల్ 15న యూనిఫాం వస్త్రం వచ్చింది. స్థానిక టైలర్లకు కుట్టడానికి ఇచ్చారు. ఇప్పటివరకు 60 శాతమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. కుట్టు కూలీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో దర్జీలు యూనిఫాం ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు. మొదటి రోజు విద్యార్థులకు ఒక్క యూనిఫామైన అందేలా కనిపించడం లేదు.

ఆదిలాబాద్‌టౌన్: బడిగంటకు వేళయింది. వేసవి సెలవుల్లో ఆటపాటల్లో గడిపిన చిన్నారులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. పుస్తకాలతో కుస్తీ పడనున్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యాలయాలు సందడిగా మారనున్నాయి. అయితే ఏటా మాదిరిగానే ఈ సారి కూడా సర్కారు బడులు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలకనున్నాయి. మన ఊరు-మన బడి పనులు ఇంకా పూర్తి కాకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో..

జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాలలు 490, ఒక కేంద్రీయ విద్యాలయం, 17 కేజీబీవీలు, 3 మినీ గురుకులాలు, ఐదు మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాలు, ఆరు మైనార్టీ వెల్ఫేర్, 636 జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలు, రెండు ఎయిడెడ్, 40 ప్రభుత్వ యాజమాన్య, రెండు డీఎన్‌టీ, 6 మోడల్ స్కూళ్లు, ఒక స్పోర్ట్స్ స్కూల్, 6 ట్రైబల్ రెసిడెన్షియల్, 3 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, 3 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 50 గిరిజన ఆశ్రమ, ఒక అర్బన్ రెసిడెన్షియల్, 167 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.

సమస్యలతో స్వాగతం..

సర్కారు బడుల్లో ప్రధానంగా ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. జిల్లాలో 546 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతేడాది విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు అవసరం ఉన్న బడులకు 132 మందిని సర్దుబాటు చేశారు. రెండేళ్లుగా విద్యా వలంటీర్ల నియామకం లేకపోవడంతో ఉన్నవారితోనే కానిచ్చేస్తున్నారు. పలు పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటి, విద్యుత్ సౌకర్యం వంటివి ఇప్పటికీ లేకపోవడం గమనార్హం.

మన ఊరు-మనబడి పనులు అంతంతే..

జిల్లాలో మన ఊరు-మనబడి పథకం కింద జిల్లాకు 237 పాఠశాలలు మంజూరయ్యాయి. అయితే ఇప్పటివరకు కేవలం పది మాత్రమే ప్రారంభించారు. మరో పది ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, డ్యూయల్ డెస్క్ బెంచీలు, గ్రీన్ బోర్డులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఈఏడాది కూడా విద్యార్థులకు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. గతేడాది మార్చిలో ప్రారంభమైన పనులు ఏడాది దాటినా ఇంకా యథాస్థితిలోనే ఉండడం గమనార్హం.

సర్వం సిద్ధం చేశాం

పాఠశాలలు నేటి నుంచి పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్‌లు పాఠశాలలకు పంపిస్తున్నాం. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. సర్కారు బడుల్లో 5వేల మంది విద్యార్థులను చేర్పించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి. – ప్రణీత, డీఈవో

పర్యవేక్షణ ప్రశ్నార్థకం..

జిల్లాలో విద్యాధికారుల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయి. డీఈవోతో పాటు 18 మండలాలకు ఇన్‌చార్జీలే ఉన్నారు. దీంతో పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ ప్రభావం విద్యార్థుల చదువుపై పడుతుంది. పదో తరగతి ఉత్తీర్ణత కూడా గతేడాదితో పోల్చితే ఈసారి తగ్గింది. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జిగా ఉండడంతో అదనపు భారంతో సరైన న్యాయం చేయలేకపోతున్నారు.

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- 1,751 మంది గైర్హాజరు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కైలాస్‌నగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంతో పాటు మావల మండల కేంద్రంలోని 19 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు అభ్యర్థులు భారీగా గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 6,190 మందికి గాను 4,439 మంది మాత్రమే హాజరయ్యారు. 1,751 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా అభ్యర్థులను 8.30 నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. వారిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి పంపారు. నిబంధనల ప్రకారం 15 నిమిషాల ముందుగానే గేట్లను మూసివేశారు. జిల్లా కేంద్రంలోని విద్యార్థి జూనియర్ కళాశాల సెంటర్‌లో ముగ్గురు అభ్యర్థులు సమయం తర్వాత రావడంతో వారిని సిబ్బంది లోనికి అనుమతించలేదు. పరీక్షను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా పలు కేంద్రాలను సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరు, వసతులను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర సాధనలో సాహితీవేత్తలది కీలకపాత్ర

- జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్
- అట్టహాసంగా సాహితీ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు, కళాకారులు, సాహితీవేత్తల పాత్ర మరువలేనిదని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం సాహితీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రజాకవి కాళోజీ, సాహితీవేత్త సదాశివ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు జిల్లా వేదిక అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వారు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. అలాంటి కవులను గౌరవించుకునేలా సాహితీ దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కవులు, కళాకారులకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. సమ్మేళనంలో పాల్గొన్న కవుల కవితలను జిల్లా స్థాయిలో పుస్తక రూపంలో ప్రచురిస్తామన్నారు. ఉత్తమ రచన, పద్య కవితలను రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. అనంతరం తెలుగు, ఉర్దూ, మరాఠీ భాషాల్లో జరిగిన కవి సమ్మేళనంలో 98మంది కవులు తెలంగాణ రాష్ట్ర ప్రగతిని, రాష్ట్ర ఉద్యమతీరు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తమ కవితల ద్వారా వివరించారు. అనంతరం వారిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఒక్కొక్కరికి రూ.1,116 నగదు, ప్రశంసపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, డీఈవో ప్రణీత, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: నిత్యం విధుల్లో బిజీగా ఉండే వైద్యులకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్ర సమీపంలోని క్రీడా మైదానంలో ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. ముందుగా క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఐఎంఏ, రిమ్స్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఐఎంఏ జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, డెంటల్ వైద్యుల సంఘం అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, సమీఒద్దీన్, డాక్టర్ రమ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు ప్రోత్సాహం



హాకీ స్టిక్స్ పంపిణీ చేస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: హాకీ క్రీడాకారులను ప్రోత్సహించేలా హాకీ ఇండియా చర్యలు తీసుకుంటుందని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హాకీ ఇండియా పోర్టల్‌లో నమోదు చేసుకున్న క్రీడాకారులకు ఆదివారం స్టిక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోని ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించేలా జిల్లా అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. త్వరలోనే అసోసియేషన్ ఎన్నికల తేదీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: విద్యా సంస్థల పునఃప్రారంభం నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిడాం సాయికుమార్, అశోక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాలన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీతో పాటు పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రవీందర్, వినోద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తోడేస్తున్నారు..!

- పెన్‌గంగలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- వీడీసీల సహకారంతో జోరుగా అక్రమ దందా
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న యంత్రాంగం



“ ఇక్కడ కనిపిస్తున్నది జైనథ్ మండలం డొల్లార సమీపంలో గల పెనగంగ నదిలో చేపడుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు. ఇది 44వ నంబర్ జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకున్నా కొందరు ఏకంగా నదిలోనే అడ్డా వేసి పొక్లెయిన్లు, డీజిల్ బోట్ల సాయంతో ఇసుకను నిరంతం ఇలా తోడేస్తున్నారు. వందలాది లారీలు, ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలించేస్తున్నారు.

జైనథ్/బేల/ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు మండలాల గుండా ప్రవహించే పెన్‌గంగలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రధానంగా జైనథ్, బేల మండలాల పరిధిలో రాత్రింబవళ్లు ఈ తంతు యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వ అనుమతి లేకున్నా కొందరు మాఫియాగా మారి ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. వీడీసీల సహకారంతో పొక్లెయిన్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇదంతా బహిరంగ రహస్యమే అయినా సంబంధిత శాఖల అధికారులు 'మామూలు'గా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

వీడీసీల సహకారంతో..

జిల్లాలోని జైనథ్,బేల మండలాల పరిధిలో ఉన్న పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లోగల పలు గ్రామాలు వీడీసీల పేరిట అనధికార టెండర్లు నిర్వహిస్తున్నాయి. రూ.25లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చెల్లించి వీటిని దక్కించుకున్న కొంతమంది నదిలో అక్రమ తవ్వకాలు చేపడుతూ తెలంగాణతోపాటు మహారాష్ట్రకు తరలిస్తూ రూ.కోట్లలో ఆర్జిస్తున్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక వీడీసీలు ఇందులో భాగస్వాములుగా ఉండటంతో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా శాఖల అధికారులు సైతం 'మామూలు'గా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. జైనథ్ మండలంలోని డొల్లార, సాంగ్వి, పెండల్‌వాడ, ఆనంద్‌పూర్,బేల మండలంలోని సాంగిడి, మాంగ్రూడ్ గ్రామాల్లో ఇసుక తవ్వకాల కోసం ఏటా వేలం నిర్వహిస్తుంటారు. ఈసారి రెండు గ్రామాలు మినహా మిగతా చోట్ల వేలం ద్వారా కైవసం చేసుకున్న కొందరు తవ్వకాలు నిరంతరం చేపడుతున్నారు. పెండల్‌వాడ, మాంగ్రూడ్‌లో మాత్రం వీడీసీలు ట్రాక్టర్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు రాయల్టీ వసూలు చేస్తున్నారు.

తోడుతున్న తీరిది..

వేసవిలో నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో పొక్లెయిన్లతో పాటు ప్రత్యేకంగా తెప్పించిన డీజిల్ బోట్లను ఇందులో ఏర్పాటు చేసి హైటెక్ విధానంలో ఇసుకను తోడేస్తున్నారు. కూలీల ప్రమేయం లేకుండా యంత్రాల సాయంతోనే ఈ ప్రక్రియ చేపడుతున్నారు. డీజిల్ బోట్ నదిలో ఉండి పైపుద్వారా ఇసుకతో పాటు నీటిని తరలిస్తోంది. పక్కనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జల్లెడ నుంచి ఇసుక వేరవుతోంది. ఇలా సేకరించిన ఇసుకను పొక్లెయిన్ సాయంతో కుప్పలుగా పోసి లారీలు, ట్రాక్టర్లలో నింపి తరలిస్తుంటారు. ఒక లారీ ఇసుక తోడేందుకు బోట్ నిర్వాహకులు రూ.2,000 నుంచి 2,500 వరకు చార్జీ చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఒక్కో పొక్లెయిన్‌కు నెలకు రూ.2లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు చెల్లిస్తుండడం చూస్తే అక్రమ దందా తీరును అంచనా వేయవచ్చు.

రాత్రింబవళ్లు తవ్వకాలు

డొల్లారలో ఇసుక తవ్వకాల కోసం వీడీసీకి రూ.37లక్షలు టెండర్ ద్వారా సమకూరినట్లు తెలుస్తోంది. దాదాపు 20 మంది వివిధ గ్రామాల నాయకులు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. ఇక ఆనంద్‌పూర్ వీడీసీకి వేలం ద్వారా రూ.25.50 లక్షలు సమకూరాయని వినికిడి. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరో ముగ్గురు నాయకులతో కలిసి ఈ దందా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక బేల మండలం సాంగిడి వీడీసీకి రూ.25 లక్షలు చెల్లించి వేలం దక్కించుకున్న కొందరు దాదాపు నాలుగు నెలలుగా నదిలో తవ్వకాలు చేపడుతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్నది ఆనంద్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఇసుక డంప్. నది నుంచి తీసుకొచ్చిన ఇసుకను తొలుత ఇక్కడ డంప్ చేస్తారు. అనంతరం ఆర్డర్ల ప్రకారం ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

జాతీయ రహదారి గుండా తరుచూ వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాటికి జరిమానా విధిస్తున్నాం. జైనథ్, బేల మండలాల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటాం. రెండు మండలాల్లో అధికారికంగా ఎలాంటి రీచ్‌లు లేవు. ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతులు ఇవ్వలేదు.
– రవిశంకర్, జిల్లా మైనింగ్ ఏడీ

వారు కోరితే సహకారం..

ఇసుక అక్రమ తరలింపును కట్టడి చేయడంలో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులదే కీలక బాధ్యత. ఆయా శాఖల అధికారులు మమ్మల్ని సంప్రదించి సాయం కోరితే చర్యలు చేపడతాం. అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి ఇసుక తవ్వకుండా చూస్తాం. అయినప్పటికీ ఇసుక అక్కడక్కడా తనిఖీలు చేపడుతూ వాహనాలను సీజ్ చేస్తున్నాం.
– ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

జిల్లా వాసికి డాక్టరేట్



దాక్టరేట్, పురస్కారంతో వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతి

ఆదిలాబాద్: జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి చికిలి లక్ష్మి వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతికి అరుదైన గౌరవం లభించింది. అమెరికాకు చెందిన పరిశోధన సంస్థ ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజికల్ ఫెడరేషన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ముంబైలోని ఖాందావలి వెస్ట్ ప్రాంతంలోని కంట్రీ క్లబ్ వేదికగా ఆదివారం జరిగిన అగ్ని మంతన్-2023లో ఆయన్ను డాక్టరేట్‌తో సన్మానించింది. గత 32 ఏళ్లుగా జ్యోతిష్యంలో చేసిన విశేష కృషికి పంచాంగ గణనకు జ్యోతిష్య చక్రవర్తి పురస్కారం అందజేసింది. అదే విధంగా సంస్థలో లైఫ్ టైం మెంబర్‌షిప్ ఇవ్వడం, ఆయనకు డాక్టరేట్, పురస్కారం లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. మధ్యాహ్న సమయంలో ఆడుకుంటుండగా ఆనం(4), సోఫియా(3), సుమయ్య(2)లపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. స్థానికులు, కుటుంబీకుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పిందని ఉప సర్పంచ్ అశోక్ పేర్కొన్నారు. గాయాలైన చిన్నారులను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

తునికాకు పట్టివేత



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కడెం: మండలంలోని పాండ్వపూర్ సమీపంలో తునికాకు తరలిస్తున్న ఎనిమిది మందిని అటవీ సిబ్బంది ఆదివారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. వారి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జన్నారం, దస్తురాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. టైగర్ జోన్ కోర్ ఏరియా నుంచి తునికాకు సేకరణ నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు బాలుడు అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ పురుషోత్తంచారి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలనీకి చెందిన మంగల్వార్ పుష్పలత-సంతోష్ దంపతుల కుమారుడు సాయికృష్ణ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి రూ.100 తీసుకొని ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కాలనీలో, బంధువుల వద్ద గాలించారు. ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబీకులు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, బాలుడు స్థానికంగా ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గులాబీ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నోట్‌బుక్స్ పంపిణీకి సిద్ధం

- నిర్మల్ జిల్లాలో మొత్తం నోట్‌బుక్‌లు 2,76,789
- 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం



బడిబాటలో ఉపాధ్యాయులతోపాటు పాల్గొన్న డీఈవో(ఫైల్)

నిర్మల్ జిల్లా వివరాలు..
(ప్రభుత్వ, పంచాయతీరాజ్, గురుకులాలు, మోడల్, కేజీబీవీలు, అర్బన్ స్కూళ్లు)

మండలం	స్కూల్స్/కాలేజీలు	నోట్ బుక్స్
బాసర	20	6,573
భైంసా	60	28,781
దస్తురాబాద్	15	7,351
దిలావార్‌పూర్	23	9,233
కడెం	43	13,120
ఖానాపూర్	49	17,026
కుభీర్	67	14,594
కుంటాల	28	15,663
లక్ష్మణచాంద	32	17,059
లోకేశ్వరం	37	12,394
మామడ	40	18,444
ముధోల్	40	15,544
నర్సాపూర్(జి)	22	9,986
నిర్మల్‌అర్బన్	42	30,690
నిర్మల్‌రూరల్	27	8,091
పెంబి	19	4,925
సారంగాపూర్	56	18,308
సోన్	23	12,623
తానూర్	44	16,384
మొత్తం	687	2,76,789

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం మనఊరు-మనబడి ద్వారా సర్కారు బడుల బలోపేతానికి కృషి చేస్తోంది. ఇప్పటికే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తుండగా ఈ విద్యాసంవత్సరం ఉచిత నోట్ బుక్స్ పంపిణీకి రంగం సిద్ధం చేసింది. ఈమేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బడులు ప్రారంభమైన తొలివారంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వర్క్‌బుక్స్, 6 నుంచి ఇంటర్ వరకు తరగతుల వారీగా బుక్‌లు పంపిణీ చేయనుంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, గురుకులాలు తదితర ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్, 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్‌లను అందించనున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20 విద్యా దినోత్సవం నాటికి పంపిణీ చేయనున్నారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ, సమగ్ర శిక్ష సమన్వయంతో ఇప్పటికే ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. మన ఊరు-మనబడి ద్వారా బడుల రూపురేఖలు మారిపోయాయి. గతేడాది పదో తరగతి విద్యార్థుల కోసం సాయంత్రం స్టడీ అవర్స్ కోసం ఉచిత స్నాక్స్, రాగిజావా పంపిణీని చేపట్టింది. ఈ విద్యాసంవత్సరం జూన్ 20 నుంచి పూర్తిస్థాయిలో రాగిజావా అందజేయాలని సంకల్పించింది.

బడిబాటలో విద్యార్థుల నమోదు

ఈనెల 3 నుంచి ప్రారంభమైన 'బడిబాట'లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటింటివెళ్లి ప్రభుత్వ బడుల్లో చేరాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. గడపగడపకూ తిరిగి ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తున్నారు. వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరుగుతోంది.

తరగతుల వారీగా...

ఆరు, ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 నోట్‌బుక్‌లు ఉచితంగా ఇవ్వనుండగా.. 8వ తరగతి వారికి ఏడు, 9, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 14 నోట్ బుక్‌లు పంపిణీ చేయనున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి 12 నోట్ బుక్‌లు, జిల్లా వ్యాప్తంగా 2,76,789 బుక్‌లు అందిచనున్నారు. జిల్లాకేంద్రం నుంచి ఆయా మండలాల ఎంఈవోలకు ఈ నోట్ బుక్స్ పంపిణీ కానుండగా.. మండలాల నుంచి ఆయా పాఠశాలలకు అవి చేరనున్నాయి. హెచ్‌ఎంలు వాటిని విద్యార్థులకు అందిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు బుక్స్ అందిస్తాం

ఈ విద్యాసంవత్సరం నోట్ బుక్స్ పంపిణీకి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని మండలాల వారీగా నోట్‌బుక్స్ పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. అవి వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

ఇంద్రాదేవికి విత్తన పూజలు





ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి ఆలయంలో ఆదివారం విత్తనపూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ రైతులు తరలివచ్చారు. నవ ధాన్యాలతో కూడిన నైవేద్యం తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

– ఇంద్రవెల్లి(ఖానాపూర్)

యాదాద్రీశున్ని దర్శించుకున్న ఎంపీ 'సోయం'



ఎంపీ, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

ఆదిలాబాద్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఎంపీ సోయం బాపూరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, వేద పండితులు ఎంపీకి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీతోపాటు ఆయన సతీమణి భారతి భాయి, కుమారుడు వెంకటేశ్ దంపతులు, కూతురు కృష్ణవేణి, కుమారుడు మహేశ్‌కు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు. తిరుపతి కన్నా యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

ఇంద్రవెల్లి, భీంపూర్‌లో భారీ వర్షం



ఇంద్రవెల్లి/తాంసి: ఇంద్రవెల్లి, భీంపూర్ మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇంద్రవెల్లి మండలం కోలయ్‌పాంద్రి, గోండ్‌గూడ, అంజీ, మామిడిగూడ తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు పలువురి ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. అధికారులు ఇళ్లను పరిశీలించి ఆర్థికసాయం అందించాలని బాధితులు కోరారు.

అమ్మవారి దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



శేఖర్ మృతదేహం



రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యాన్

సారంగాపూర్: అడెల్లి మహాపోచమ్మను దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఒకరు అనంతలోకాలకు వెళ్లిపోయాడు. ఆలయ సమీపంలోని రాయికానగర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన అయ్యన్నగారి శేఖర్(40) అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద తన బంధువులు చేస్తున్న శుభకార్యానికి భార్య రాధికతో కలిసి హాజరయ్యాడు. విందు భోజనం అనంతరం తిరిగి పయనమయ్యారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా కిసానగర్‌కు చెందిన ఆరిఫ్‌బేగ్ ఐచర్ వ్యాన్‌తో వేగంగా నడుపుతూ శేఖర్ బైక్‌ను ఢీకొట్టాడు. కిందపడిన శేఖర్ పైనుంచి వ్యాన్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రాధికతోపాటు డిగ్రీ రెండో సంవత్సరం, ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కయిన శేఖర్ మృతితో ఆ కుటుంబం వీధి పాలైంది.

మంచిపేరు తెచ్చుకున్న శేఖర్..

నిర్మల్ జిల్లా ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసే శేఖర్ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తారని మంచిపేరు ఉంది. ఇటీవల కార్యాలయ ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా ప్రాంతీయ రవాణాధికారి అజయ్‌రెడ్డి ఆయన సేవలను గుర్తించి ప్రశంసించారు. కాగా, శేఖర్ మృతి విషయం తెలుసుకున్న ఆర్టీవో విచారం వ్యక్తంచేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈమేరకు సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎదురెదురుగా కార్లు ఢీ



కార్ల ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం



క్షతగాత్రుడిని తరలిస్తున్న స్థానికులు

- నలుగురికి తీవ్ర, మరో నలుగురికి స్వల్పగాయాలు

భైంసాటౌన్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది గాయాలపాలైన ఘటన బాసర మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన సౌరభ్ తన భార్య జాన్వి, తల్లి సునీతతో బాసర అమ్మవారిని దర్శించుకుని ఆదివారం కారులో తిరుగు ప్రయాణమవుతుండగా, ఆదిలాబాద్‌కు చెందిన మల్లేశ్ తన భార్య రాధ, కొడుకులు సాయితేజ, అన్విత్, కారు డ్రైవర్ మల్లేశ్‌తో కలిసి కారులో బాసర అమ్మవారి దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో భైంసా-నిజామాబాద్ రహదారిపై బాసర వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎనిమిదికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా, అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో క్షతగాత్రులను పోలీసు వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు ఏఎస్సై ఉజ్వల తెలిపారు.

'కటకం' మృతి విప్లవోద్యమానికి తీరని లోటు

- విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి



నివాళులర్పిస్తున్న విరసం నేతలు

బెల్లంపల్లి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సుదర్శన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్ గొప్ప విప్లవ మేధావి అని ప్రశంసించారు. విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో మేథోమదనం చేశారని గుర్తు చేశారు. దండకారణ్యంలో పార్టీ నిర్మాణానికి పునాది వేసిన వారిలో సుదర్శన్ అగ్రగణ్యుడన్నారు. ప్రజాచైతన్యంతోనే విప్లవోద్యమం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో విప్లవోద్యమం అవసరం ప్రజలకు ఎంతగానో ఉండేదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమం ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో కొనసాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయడానికి ఆదివాసీ ప్రాంతాల్లో డ్రోన్‌లతో దాడులు చేయిస్తోందన్నారు. అమరుల ఆశయ సాధన కోసం మావోయిస్టు పార్టీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, అమరులు, బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకురాలు పద్మకుమారి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి కానరాని లోకాలకు..



ఆత్రం లక్కు (ఫైల్)

బజార్‌హత్నూర్: చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలో భూతాయి(బి) పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సయ్యద్ ముజాహిద్ కథనం ప్రకారం.. భూతాయి(బి) పంచాయతీ పరిధిలోని కొలంగూడకు చెందిన ఆత్రం జంగు, లచ్చుబాయిల దంపతులకు మూడో కుమారుడు ఆత్రం లక్కు (26) ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో మిత్రులతో కలిసి లక్కు భూతాయి(కే) సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు లక్కు కాలు జారి నీటిలో పడిపోయాడు. మిత్రులు అతన్ని ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కుభీర్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పల్సి గ్రామానికి చెందిన మహాగాం రమేశ్ (31)కు ప్రైవేట్ అప్పులు ఉన్నాయి. అవి తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్నానానికి వెళ్లి విద్యార్థి..



అయాజ్(ఫైల్)

నిర్మల్:జిల్లాకేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన అయాజ్ (17) ఆదివారం స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..ఇటీవల పదో తరగతి పూర్తిచేసిన అయాజ్ వారి తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. మిత్రులతో కలిసి భీమన్నగుట్ట ప్రాంతంలో ఉన్న పెద్ద నీటికుంటలో స్నానానికి వెళ్లాడు. లోతు ప్రదేశానికి వెళ్లడంతో ప్రమాదవశాత్తు మునిగి ఊపిరాడక చనిపోయాడు. పోలీస్, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి పంపించారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

భైంసాటౌన్: విధులు ముగించుకుని బైక్‌పై వెళ్తున్న ఆర్టీసీ కండక్టర్‌ను వెనుక వైపు నుంచి కారు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. లింబా(బి)కి చెందిన దిగంబర్ భైంసా ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, రాత్రి వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో కారు బోల్తాపడగా, అందులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏరియాస్పత్రికి తరలించారు. ఈ విషయమై పట్టణ సీఐ ఎల్.శ్రీనును వివరణ కోరగా, ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

కొత్తగా నిర్మించిన చేపల మార్కెట్‌లో ఆటలు ఆడుకుంటున్న పిల్లలు



భాగ్యనగర్‌లో పాత చేపల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి



జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్‌లో మూడు నెలల క్రితం ప్రారంభించిన చేపల మార్కెట్ నిరుపయోగంగా మారింది. దీంతో పిల్లలు ఆటలు ఆడుకుంటున్నారు. చేపల విక్రయాలకు మత్స్యకారుల కోసం రూ.65 లక్షలతో రెండు షెడ్లు నిర్మించారు. ఇక్కడ కాకుండా భాగ్యనగర్ రోడ్డుపై పాత చేపల మార్కెట్‌లో అమ్మకాలు చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఇచ్చోడ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఇచ్చోడలో రాయల్ ప్యాలెస్‌లో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డవారు ఇక్కడకు వచ్చారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామారావు, ప్రేమల, ఖాజామీయా, లక్ష్మారెడ్డి, నారాయణ్‌రెడ్డి, పోశెట్టి, జీయోహొద్దిన్‌లను సన్మానించారు.